క్లుప్తంగా

ఆర్టీసీ డిపోకు రూ.6 కోట్ల మంజూరుపై హర్షం



డిపో వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, తదితరులు

నిడదవోలు: నిడదవోలు ఆర్టీసీ డిపో అభివృద్ధికి రూ.6 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల తరఫున ఆ పార్టీ నాయకుడు జువ్వల రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గాల నిర్లక్ష్యంతో ఆరు దశాబ్దాలుగా నిడదవోలు ఆర్టీసీ డిపో అభివృద్ధి మరుగున పడిపోయిందని రాంబాబు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కొద్దిపాటి వర్షానికి డిపో మునిగిపోతుండడం వల్ల ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిడదవోలు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డిపో అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ, సీఐటీయూ నాయకులు జి.డానియల్, టి.నాని, రవి, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం వారు డిపో వద్ద హర్షం వ్యక్తం చేశారు.

షాదీఖానా మంజూరుపై ముస్లింల హర్షం



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

నిడదవోలు: ముస్లింలు వివాహాలు చేసుకునేందుకు వీలుగా నిడదవోలు పట్టణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి షాదీఖానా మంజూరు చేయడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిడదవోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్ మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడులకు మైనార్టీ సెల్ తరఫున, ముస్లిం మైనారిటీల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఎండీ షాకిరా బేగం,అహ్మదున్నీసా బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ ఫయాజ్, అఫ్సర్ జానీ బేగ్, అబ్దుల్ రెహ్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

చాగల్లు: లయన్స్ క్లబ్ చాగల్లు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ క్లబ్ అధ్యక్షుడు పిచ్చికుల సత్యనారాయణ, గ్రంధి రాంబాబు, కె.నాగేశ్వరరావు, కె.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మట్టి గణనాథుని విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక వ్రత కల్పం పుస్తకంతో పాటు గణపతి విగ్రహాన్ని భక్తులకు ఉచితంగా అందజేశారు.లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, కార్యదర్శి పెనుమాక జయరాజు, కోశాధికారి ఉప్పలూరి రామకృష్ణ, సభ్యులు పాత్రు శ్రీనివాసరావు,బూరుగుపల్లి వెంకటేశ్వరరావు,యనమదల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ప్రెస్‌క్లబ్ వద్ద మట్టి గణనాథుడి విగ్రహాలను పంపిణీ చేశారు.ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా స్వామినాయుడు చేతుల మీదుగా విగ్రహాలను పంపిణీ చేశారు.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.లక్ష

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.1,00,720 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాళ్లయ్యా... ఊరంతా వేడుకయ్యా

- నేటి నుంచి వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా మండపాలు
- భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



కొవ్వూరు లాంచీల రేవు వినాయక మండపం వద్ద సెట్టింగ్



కొవ్వూరు మెరక వీధి వాటర్ ట్యాంక్ వద్ద పూజలు అందుకోనున్న గణనాథుడు

కొవ్వూరు: గణపతి నవరాత్ర ఉత్సవాలకు వేదికలు ముస్తాబయ్యాయి. ఉత్సవాల వేదికల వద్ద భారీ ఎత్తున లైటింగ్, డెకరేషన్ సిద్ధం చేశారు. సోమవారం నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా చాగల్లులో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 200 వరకూ ఉత్సవాల శిబిరాలను ఏర్పాటు చేశారు. గతేడాది కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 50 చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండలాల వారీగా తాళ్లపూడిలో 40, కొవ్వూరులో 25, చాగల్లులో 30 చొప్పున గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇవే గాకుండా మరో 50కి పైగా చిన్న శిబిరాలు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నా రు. ఇప్పటికే అనుమతుల కోసం ఆయా కమిటీలు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వివిధ రకాల ఆకారాల్లో ఉండే వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

కొవ్వూరులో ఎక్కడెక్కడ..

కొవ్వూరులోని మెరక వీధి రౌండ్ రామాలయం వద్ద ప్రతిష్ఠించేందుకు యూత్ భారీ వినాయక విగ్రహాన్ని హైదరాబాద్ వంటి నుంచి తీసుకొచ్చారు. పట్టణంలో ప్రధానంగా మెరక వీధి వాటర్ ట్యాంకు, లాంచీల రేవు, రెల్లిపేట యూత్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ రోడ్డులోను, సుబ్రహ్మణ్యస్వామి స్నానఘట్టం వద్ద వాడబలిజ సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక గాయత్రీ థియేటర్ సెంటర్‌లోను, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ కాలనీ, సత్యవతి నగర్, 22వ వార్డు పోతురాజు దిబ్బ ప్రాంతంలోను, రెండో వార్డు వినాయకుడి గుడి ప్రాంగణంలోను, లాయర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లోను శిబిరాలు ఏర్పాటు చేశారు. తాళ్లపూడి మండలం కేంద్రంలోను, చాగల్లు, కొవ్వూరు మండలాల్లోను పలు చోట్ల వాడవాడలా ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.


పోలీసుల అనుమతి తప్పనిసరి



వినాయక ఉత్సవ శిబిరాల ఏర్పాటుకు విధిగా పోలీసుల అనుమతి పొందాలి. నిబంధనలకు లోబడి ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ఏం జరిగినా కమిటీ నిర్వాహకులపైనే చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా ప్రజలకు ఇబ్బందుల్లేని ప్రదేశాల్లో వినాయక మంటపాలు ఏర్పాటు చేసుకోవాలి.ఉత్సవాల రోజు వారీ కార్యక్రమాలు, నిమజ్జనం షెడ్యూల్‌ను ముందుగానే పోలీసులకు తెలియపరచాలి. మైక్ పర్మిషన్ తప్పనిసరి. ఉదయం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే మైక్‌లకు అనుమతి ఉంటుంది.

– వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ, కొవ్వూరు

చవితి ఉత్సవాలకు చాగల్లు ముస్తాబు



ముఖ ద్వారం విద్యుదీపాలంకరణ సెట్టింగ్



ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుదీపాలు

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాలకు రాష్ట్ర స్థాయిలోనే చాగల్లు ప్రసిద్ధి గాంచింది. చాగల్లు తెలగా సంఘం, చాగల్లు, నెలటూరు వర్తక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చాగల్లులో 68 ఏళ్లుగా ఈ రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పోటాపోటీగా చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి 26 వరకూ తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే భారీ సెట్టింగులు, విద్యుద్దీపాల అలంకరణ, దేవతామూర్తుల విగ్రహాలు, ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ తొమ్మిది రోజులూ చాగల్లు ప్రధాన కూడలి విద్యుద్దీపాల వెలుతురులో ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. రోజూ రాత్రి పూట ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. రాష్ట్రస్థాయిలో పేరెన్నిక గన్న రంగస్థల కళాకారులు ఇక్కడి వేదికలపై తమ నటనా కౌశలాన్ని ప్రదర్శిస్తారు. పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలతో పాటు సినీ మ్యూజికల్ నైట్‌లు జరుగుతాయి. ఒక్కో ఉత్సవ కమిటీ సుమారు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల చొప్పున ఖర్చు చేసి ఉత్సవాలకు నిండుదనం తెస్తారు. తెలగా సంఘం ఆధ్వర్యంలో గంధ్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలోను, వర్తక సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పక్కనే గల కళావేదిక వద్ద భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ స్వగ్రామం చాగల్లు కావడంతో ఆయన నవ రాత్ర ఉత్సవాల్లో ఏటా పాల్గొంటారు.టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఇక్కడి వేదికలపై బంగారు పతకాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేయడం ఇక్కడి ఉత్సవాల ప్రత్యేకత. పేరెన్నికగన్న కళాకారులను సత్కరిస్తారు. నవరాత్ర వేడుకలు సందర్భంగా ఉత్సవాలు తిలకించడానికి వచ్చే బంధుమిత్రులతో గ్రామంలోని ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. చాగల్లు నవరాత్ర వేడుకలను తిలకించడానికి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు అనేక మంది ఇతర ప్రాంతాల వారు కూడా ఇక్కడకు చేరుకుంటున్నారు.

నిరంతరాయంగా సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- దారవరంలో సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం



దారవరం సభలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: విపక్షాలు, ఎల్లో మీడియా ఎన్ని అవాంతరాలు సృష్టిస్తున్నా నిరంతరాయంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో రూ.57.5 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆదివారం రాత్రి మంత్రి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తానేటి వనిత మాట్లాడారు. జగన్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇవే పథకాలను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ఎన్నో ప్రయత్నాలు చేసి, విఫలం అయ్యారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్కామ్‌లో చంద్రబాబు ప్రమేయం ఉన్నట్టు నిర్ధారణ అయ్యాకే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని మంత్రి వనిత అన్నారు.

పార్టీలో చేరికలు

దారవరం గ్రామంలో వివిధ పార్టీల నుంచి యువకులు మంత్రి తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి వనిత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్, మండలశాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు ఊబా భాగ్యవతి పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ సీపీ గ్రామ, మండల కమిటీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం

దేవరపల్లి: అభివృద్ధి కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులకు ప్రాధాన్యం ఉంటుందని, సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పార్టీ విజయానికి సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. వైఎస్సార్ సీపీ గ్రామ, మండల కమిటీల అధ్యక్షులు, గ్రామ సచివాలయ కన్వీనర్ల గోపాలపురం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం దేవరపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే సరిదిద్దుకుని 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పని చేయాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.నిడదవోలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలిసి సొంత స్థలాలున్న పేదలకు గృహాలు మంజూరు చేయాలని కోరగా, ఐదు వేల గృహాల మంజూరుకు ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) మాట్లాడుతూ పార్టీ శ్రేణులు రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలువురు గ్రామ , మండల కమిటీల అధ్యక్షులు తమ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో పార్టీ గోపాలపురం మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, దేవరపల్లి మండల గ్రామ సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, ద్వారకాతిరుమల మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు కృష్ణశేషసాయి, నల్లజర్ల మండల జేసీఎస్ కన్వీనర్ కటారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి. చిత్రంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జీవీ

సీఎం జగన్‌కు అపూర్వ జనాదరణ

- 2024 ఎన్నికల్లో గెలుపు ఆయనదే
- ముఖ్యమంత్రి సభ విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు: నిడదవోలు బహిరంగ సభలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభించిన ప్రజాదరణను చూస్తే 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రికార్డు స్థాయి విజయం దక్కుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. విపక్షాల చిరునామాలు గల్లంతు కావడం ఖాయమన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు హాజరై, కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు, అధికారులు, మంత్రులు, తోటి ఎమ్మెల్యేలకు శ్రీనివాస్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో నిడదవోలుతో పాటు కొవ్వూరు, గోపాలపురం, రాజమహేంద్రవరం, తణుకు నియోజకవర్గాల నుంచి కూడా భారీ ఎత్తు జనం బహిరంగ సభకు వచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను ఇప్పటికే నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ తన నిబద్ధతకు చాటుకున్నారన్నారు. ద్రోహానికి చంద్రబాబు మారు పేరైతే, విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్ అని అభివర్ణించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

శనివారం నాటి పర్యటనలో నియోజకవర్గ అభివృద్ధికి తాను కోరిన అన్ని పనులకూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మీడియా సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకూ వశిష్ట గోదావరి కుడి ఏటిగట్టుపై బీటీ రోడ్డుకు, నిడదవోలు ప్రభుత్వాస్పత్రి స్థాయిని 100 పడకలకు పెంచేందుకు, నిడదవోలు ఆర్టీసీ బస్ డిపో అభివృద్ధికి, ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామంలో అత్తిలి కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి, నిడదవోలులో పలు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.185 కోట్లు

నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సీఆర్ఐఎఫ్ నిధులు రూ.185 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు చెప్పారు. ఆర్ అండ్ బీ అధికారులతో కలసి సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ఆర్‌ఓబీ నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి సహకారంతో భూసేకరణకు రూ.16 కోట్లు పరిహారంగా బాధితులకు అందజేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సేతుబంధు పథకం ద్వారా ఆర్‌ఓబీ నిర్మాణానికి రూ.185 కోట్లు మంజూరు చేయించిన సీఎం జగన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే పనులు చేపడతామని చెప్పారు.

ప్రకటన

[illegible]

మోదీ ఆరోగ్యానికి బీజేపీ పూజలు

కొవ్వూరు: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు కొండపల్లి రత్నసాయిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, మహిళామోర్చా రాష్ట్ర కార్యదర్శి తాడిమళ్ల విజయవాణి, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, ప్రభాస్ యోజన కన్వీనర్ బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, మడిచర్ల రామచంద్రరావు, చెరుకూరి సాయిరాజు,మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పాతురాజు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: ప్రకాశరావుపాలేనికి చెందిన గణపవరపు వీరబాబు భార్య సుధారాణి ఇటీవల అస్వస్థతకు గురైంది. ఆమె వైద్య సహాయం నిమిత్తం మానవత సేవా సంస్థ మండల శాఖ ఆదివారం రూ.4 వేల ఆర్థిక సహాయం అందించింది. కార్యక్రమంలో మానవత సంస్థ మండల కమిటీ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, గుండు త్రినాథరావు, దాసు కనకాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కొవ్వూరు: గణపతి నవరాత్ర ఉత్సవాలకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు సూచించారు.ఆదివారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఉత్సవ నిర్వాహకులతో నిబంధనలపై ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఉత్సవాల్లో అన్నింటికీ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఉత్సవ శిబిరం నిర్వాహక కమిటీ సభ్యుల పూర్తి వివరాలు, అడ్రస్, ఫోన్ నంబర్‌లు అందజేయాలని సూచించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కొవ్వూరు: పట్టణ శివార్లలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకే కుటుంబంలోని ముగ్గురిలో చిటికెనకోట సత్యనారాయణ (36) అనే వ్యక్తి చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం చాగల్లు మండలం చిక్కాలకు చెందిన సత్యనారాయణ తన భార్య భవాని, రెండేళ్ల కుమారుడితో కలసి బైక్‌పై రాజమహేంద్రవరం వస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. వారిలో సత్యనారాయణ చికిత్స పొందుతూ కాకినాడలో మృతి చెందారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



దేవరపల్లిలో విశ్వకర్మ చిత్ర పటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: విశ్వకర్మ జయంతిని స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవరపల్లిలో ఘనంగా నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాల్లో భాగంగా ఈ వేడుకలను నిర్వహించి పూజలు చేశారు. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ వార్లకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, పలువురు నాయకులు పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొన్నాడ వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు దుగ్గిన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో ర్యాలీ



నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

నిడదవోలు: విశ్వకర్మ జయంతిని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నిడదవోలు పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా సంఘ మండల శాఖ అధ్యక్షుడు లావేటి జేజీ శివన్నారాయణ, మండలం విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దాల శ్రీనివాస్ జండాను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి నాగోజు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఒక కార్యక్రమానికి విశ్వకర్మ పేరు పెట్టాలని కోరారు. విశ్వబ్రాహ్మణులు జెండాలు పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మోజు చంద్రశేఖర్, ర్యాలీ ఆనంద్ సుంటాని, రామకృష్ణ, నరేష్, సతీష్ , ఫణి, విటల్, జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.